



కొవ్వాడ అణుపార్కును రద్దు చేయాలి : సిపిఎం

లక్ష్యం చేరుకునేనా..?

- ఖరీఫ్‌లో ఏడు లక్షల టన్నుల ధాన్యం దిగుబడి
- ఇప్పటివరకు 4.16 లక్షల టన్నుల సేకరణ
- ఈనెల 15వ తేదీ నుంచి కొనుగోళ్లు నిలిపివేత
- ఆందోళనలో రైతులు

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట దిగుబడి బాగా వచ్చినా కొనుగోళ్లు మాత్రం ఆ స్థాయిలో లేవు. గతేడాది నవంబరు చివరి వారంలో కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటివరకు 60 శాతమే ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు కోసం రైతులు రైతుభరోసా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు జరగక కళ్లాల నుంచి ధాన్యం కదలడం లేదు. మరోవైపు ఫిబ్రవరి 15వ తేదీతో కొనుగోళ్లు నిలిపేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోతే తీవ్రంగా నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిల్లర్లు ఇదే అదనుగా తక్కువ ధరకే కొనుగోలు చేసి దోపిడీ చేసే అవకాశాలూ లేకపోలేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 3,82,550 ఎకరాల్లో వరి సాగు అయింది. ఇందులో 3,75,518 ఎకరాల మేర ఈ-క్రాప్‌లో నమోదైంది. 8,11,120 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల సొంత అవసరాలు, ఇతర అమ్మకాలు పోనూ సుమారు 4.38 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రైతులు, రైస్ మిల్లర్ల ఒత్తిడితో మరో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇప్పటివరకు 93,281 మంది రైతుల నుంచి 416.32 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా 62 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం విలువ రూ.841.36 కోట్లు ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ.536.45 కోట్లను చెల్లించారు. ధాన్యం రవాణా ఛార్జీల కింద


కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు

19,403 మంది రైతులకు రూ.2.59 కోట్లు జమ చేశారు. 7,103 మంది రైతులకు సంబంధించి హమాలీ ఛార్జీల కోసం రూ.63 లక్షలు చెల్లించారు. గన్నీ బ్యాగుల కోసం 54,540 మంది రైతులకు రూ.1.47 కోట్లు చెల్లించాల్సి ఉంది.

మండలాల్లో పరిస్థితి ఇలా...

జిల్లాలో ఆరు మండలాల్లో 20 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొన్నారు. తొమ్మిది మండలాల్లో 15 వేల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. పది వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసిన మండలాలు ఐదు ఉన్నాయి. మిగిలిన పది మండలాల్లో పది వేల మెట్రిక్ టన్నుల లోపే ధాన్యం సేకరించారు. జలుమూరు మండలంలో అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేశారు. ఇక్కడ 5,466 మంది రైతుల నుంచి 26,801 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నారు. సంతబొమ్మాళి మండలంలో 5,079 మంది నుంచి 22,,359 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. సారవకోట మండలంలో 4,437 మంది రైతుల నుంచి 22,238 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కవిటిలో అత్యల్పంగా ధాన్యం సేకరించారు. ఇక్కడ 398 మంది రైతుల నుంచి 1718 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అత్యల్పంగా ధాన్యం కొనుగోలు చేసిన మండలాల్లో పొందూరు రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 1168 మంది రైతుల నుంచి 4006 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. లావేరులో 1254 మంది రైతుల నుంచి 4,267 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

అన్నదాతల్లో ఆందోళన

ధాన్యం సేకరణ గడువు సమీపిస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రభుత్వం తమ ధాన్యం తీసుకుంటుందా? వదిలేస్తుందా? అన్న భయం వారిని వెంటాడుతోంది. ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారంటూ ఆర్‌బికెల చుట్టూ తిరుగుతున్నారు. మిల్లుల వద్ద ధాన్యం లోడ్లతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. తమకు ఇచ్చిన లక్ష్యం పూర్తయిందంటూ ఆర్‌బికె సిబ్బంది దూర ప్రాంతంలో ఉన్న మిల్లులకు పంపిస్తున్నారు. ధాన్యాన్ని తరలించేందుకు తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనుకావడంతో ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చుకోలేక, వ్యాపారులకు అమ్ముకోలేక సతమతమవుతున్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు



ప్రభుత్వం ఈనెల 15వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు చేస్తుంది. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం.

- పి.జయంతి,
జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ



యాత్రకు స్వాగతం పలుకుతున్న వామపక్ష, కార్మిక, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు

'సమర యాత్ర'కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రత్యేక హోదా సాధన సమితి, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సమరయాత్ర (బస్సు యాత్ర) శుక్రవారం శ్రీకాకుళం నగరానికి చేరుకుంది. ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, లెనిన్‌బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాము, రామన్న, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భూషణ్, భాస్కర్ తదితరులకు వామపక్ష, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. డేఅండ్‌నైట్ వంతెన నుంచి ఇలిసిపురం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాన్సన్‌బాబు, శివారెడ్డి, పరుచూరి రాజేంద్ర, లెనిన్‌బాబు మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. రాష్ట్ర హక్కుల కోసం పోరాడాల్సిన వైసిపి ప్రభుత్వం మోడీ చెంతకు చేరడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఐదు కోట్ల ఆంధ్రుల మనోభావాలను, హక్కులను మోడీకి పణంగా పెడితే సహించేది లేదన్నారు. ఎన్నికలు ఉన్నందునే కర్నాటకలోని వెనుకబడిన ప్రాంతానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు విడుదల చేశారని, మరి విభజన హామీల్లో భాగంగా రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు బిజెపి ప్రభుత్వం ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హక్కుల కోసం, ప్రయోజనాల కోసం, ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించే వరకు మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బలగ శ్రీరామ్మూర్తి, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.శ్రీనివాసరావు, సంపతిరావు అర్జున్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాపర సుందర్‌లాల్, ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు, ప్రత్యేక హోదా సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.నర్సునాయుడు, చాపర వెంకటరమణ పలు విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మండలంలోని కొత్తపల్లిలో గల పలు ఎరువుల దుణాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఎటువంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా అక్రమంగా, అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గ్రామానికి చెందిన కోరాడ తారకేశ్వరరావు వద్ద నుంచి రూ.31,340 విలువ గల 30 బస్తాల ఎరువులు, తంగుడు చంద్రభూషణగుప్త వద్ద రూ.23,718 విలువ చేసే 26 బస్తాల ఎరువులు అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సిఐ పి.సింహాచలం తెలిపారు. దాడిలో విజిలెన్స్ హెచ్‌సి కె.అప్పలనాయుడు, మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు ఉన్నారు.


ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు


మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎఆర్ సిబ్బంది సమస్యలపై దర్బార్

సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఎఆర్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో పోలీసు కమ్యూనిటీ హాల్‌లో పోలీసు దర్బార్‌ను శుక్రవారం నిర్వహించారు. ఉద్యోగ, వ్యక్తిగత, కుటుంబపరమైన సమస్యలను సిబ్బంది ఎస్‌పి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు విభాగాన్ని ప్రత్యేక స్థానంలో నిలపాలని ఎస్‌పి పిలుపునిచ్చారు. ఎఆర్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్ శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం పాత్ర విశిష్టమైందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలోనే కాకుండా బందోబస్తులు, పండుగలు, ఊరేగింపులకు ఎఆర్ సిబ్బంది ముందుంటే ఆ ధైర్యం వేరని తెలిపారు. స్పెషల్ పార్టీ సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. నిరంతరం విధుల్లో ఉండే సిబ్బంది విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ సభ్యులతో గడపాలని సూచించారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా నిపుణులతో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని చెప్పారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, యోగా, ధ్యానం, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పి డి.ప్రసాదరావు, ఆర్ఐ ప్రదీప్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ప్రభుత్వం పెద్దపీట

జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా శుక్రవారం ప్రారంభించారు. బటన్ నొక్కి 213 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.19.95 కోట్లను జమచేశారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, బిసి కార్పొరేషన్ ఇడి ఆర్.గడ్డెమ్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులు విదేశాల్లోని టాప్ 200 విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇతర కోర్సుల్లో విద్యను అభ్యసించే వారికి శత శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో ఐదుగురిని అర్హులుగా ఎంపిక చేసి, అందులో ఒకరైన చదువుల సింధూజకు మొదటి విడతగా రూ.35 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా విదేశాల్లో చదవాలనుకునే విద్యార్థులు తమ తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొంది ఉన్నత విద్యను అభ్యసించవచ్చన్నారు. ఈ పథకానికి అర్హత గల ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ వాటర్ లూలో ఎం.ఎస్ (ఇసిఇ) విద్యను అభ్యసిస్తున్న చదువుల సింధూజ తల్లితండ్రులకు రూ.35,18,152 నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి ఇ.అనురాధ, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు, పలువురు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్, కలెక్టర్ తదితరులు

హెచ్ఐవి రోగులకు హెపటైటిస్ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎఆర్‌టి మందులు వాడుతూ వైరల్ హెపటైటిస్ బి పరీక్ష చేయించుకుని, అందులో నెగిటివ్ ఉన్న హెచ్ఐవి రోగులకు ఈనెల 6న హెపటైటిస్ బి వ్యాధి నిరోధక టీకాను ఉచితంగా వేయనున్నట్లు అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎన్.అనురాధ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళం, టెక్కలి ఆసుపత్రుల్లో మూడు మోతాదుల్లో ఈ టీకాను ఉచితంగా వేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని హెచ్ఐవి రోగులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపిఎం కె.ఉమామహేశ్వరరావు, టెక్కలి డిహెచ్ ఆర్ఎంఒ అప్పలనాయుడు, ఎఆర్‌టి ఎంఒ, జిజిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - పలాస

అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుదర్శనం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యూనియన్ కాశీబుగ్గ ప్రాజెక్టు సర్వసభ్య సమావేశం బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. టిఎ, డిఎ ఐదేళ్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇచ్చినప్పుడు ఫేస్ యాప్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగం ఉందని అంటున్నారని, ఉద్యోగులుగా గుర్తించాలని కోరితే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, జీతంలో సగం పెన్షన్‌గా చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6వ తేదీన చేపడుతున్న ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం.మంజుల కుమారి, కార్యదర్శిగా బి.ఆదిలక్ష్మితో పాటు మరో 20 మందితో కూడిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు కె.జ్యోతి, పి.పద్మావతి, తులసమ్మ, కృష్ణవేణి, మల్లీశ్వరి, అలివేణి, ఉమాభాయి, తులసమ్మ, డి.రమాదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శనం

ఎంత కూలి వస్తుంది?

ఉపాధి పనులను పరిశీలించిన జాతీయ బృందం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని బోరుభద్ర, కొల్లిపాడు పంచాయతీలో రెండేళ్లుగా చేపట్టిన ఉపాధి హామీ పనులను జాతీయ బృందం సభ్యులు గిరిజా శంకర్ పాడి, సత్యరంజన్ రౌత్ పరిశీలించారు. ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన చెరువుల వల్ల ప్రయోజనం కలిగిందా అని రైతులను ప్రశ్నించారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి, రాగులు పంటలకు నీరందుతుందని చెప్పారు. దీనివల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తున్నాయని తెలిపారు. రైతుల అభిప్రాయాలు తీసుకుని సక్సెస్ స్టోరీని రెండు రోజుల్లో నివేదికగా అందజేయాలని సిబ్బందికి సూచించారు. బోరుభద్రలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ రోజుకు ఎంత కూలి వస్తుంది? సకాలంలో వస్తున్నాయా? అని అడిగారు. రోజుకు రూ.200 నుంచి రూ.220 వరకు వస్తుందని, అది సరిపోవడం లేదని కూలీలు చెప్పారు. రూ.300 వచ్చేలా చూడాలని కోరారు. వంద రోజుల పనిదినాలను 150 రోజులకు పెంచాలన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, ఎపిడి మురళీకృష్ణ, ఎంపిడిఒ జి.ఉమాసుందరి, హౌసింగ్ ఎఇ బి.నర్సింగరావు, ఎపిఎం సూర్యనారాయణ, ఎపిఒలు వాసునాయుడు, హరిప్రసాద్, సర్పంచ్‌లు జి.ఉషారాణి, బి.లక్ష్మీకాంతం, ఇసి మునీంద్ర, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


కొల్లిపాడులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న జాతీయ బృందం సభ్యులు



నియామకపు పత్రాలను అందజేస్తున్న డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

నిరుద్యోగులకు నియామక పత్రాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో గల స్కిల్ హబ్ కేంద్రంలో నిరుద్యోగ యువతకు 90 రోజుల పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు, సూయింగ్ మెషిన్ ఆపరేటర్ (టైలరింగ్) కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం హబ్ కేంద్రంలో నిర్వహించారు. శిక్షణ పొందిన వారికి డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్ నియామకపు పత్రాలు, శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. డేటాఎంట్రీ ఆపరేటరు కోర్సులో 30మంది అభ్యర్థులు, సూయింగ్ మెషిన్ ఆపరేటర్ కోర్సులో 30 మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిని మౌరిటెక్, ఎక్సటి గ్లోబల్ కాల్ సెంటర్‌లో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి సాయి శ్రీనివాసరావు, ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ వై.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

లోక్ అదాలత్‌తో కేసులకు శాశ్వత పరిష్కారం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

లోక్ అదాలత్‌లో కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఈనెల 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేయడంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేందుకు తోడ్పాటు అందించాలన్నారు. సివిల్ కేసుల్లో రాజీ కావడం వల్ల కుటుంబంలో బంధాలు బలపడే అవకాశం ఉంటుందన్నారు.

కేసులతో కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం, డబ్బులు వృథా అవుతాయని చెప్పారు. లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఆదా అవుతాయని తెలిపారు. సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెజ్జిపురపు ఫల్గుణరావు, కార్యదర్శి ఎ.భువనేశ్వరరావు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబరు గేదెల వాసుదేవరావు, ప్రభుత్వ న్యాయవాది వినయ్ భూషణ్, సీనియర్ న్యాయవాదులు పొన్నాడ వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.


డాక్టరేట్‌ను అందుకుంటున్న సూర్యారావు

సూర్యారావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ జిల్లా పూర్వ అధ్యక్షులు ఎన్ని సూర్యారావుకు డాక్టరేట్ లభించింది. ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, ఐఎఎస్ఇ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శోభాశ్రీ చేతుల మీదుగా సెయింట్‌పాల్ థియోలాజికల్ కాలేజ్ ఆధ్వర్యంలో విశాఖలోని పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించిన 11వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ బాలల రక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం, డాక్టర్ స్టీవెన్, డాక్టర్ దేవప్రసాద్ సెయింట్‌పాల్ డైరెక్టర్ డాక్టర్ కె.వి.ఎన్ పాల్ సూర్యారావు అందించిన సేవలను ప్రశంసించారు.

'యువగళం'తో జగన్‌కు వణుకు

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రతో జగన్‌తో పాటు వైసిపి నాయకుల్లో వణుకు మొదలైందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు, టిడిపి నాయకులు గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివస్తూ తమ సమస్యలను నివేదించుకుంటున్నారు. జనాదరణను చూసి ఓర్వలేక పాదయాత్రను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. అందులో భాగంగానే పలమనేరులో లోకేష్ ప్రచార వాహనాన్ని సీజ్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించారని చెప్పారు. తోపులాట సృష్టించి, ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించడంతో పోలీసులు ప్రచార రథాన్ని విడిచిపెట్టారన్నారు. దారిపొడవునా ఇలాంటి అడ్డంకులను సృష్టించి పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తే ప్రజలు క్షమించరని చెప్పారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిన వైసిపి కుట్రపూరిత చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైసిపి మునిగిపోతున్న నావ అని వ్యాఖ్యానించారు.

ఆర్టీసీ డ్రైవర్లకు అభినందనలు

ప్రజాశక్తి - టెక్కలి

ఆర్టీసీ డిపోలో డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తూ విధి నిర్వహణలో బాధ్యతా వ్యవహరించి, ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపబడ్డ కె.జయకుమార్, బి.ఎం.రావు, కె.లక్ష్మీనారాయణను ఆర్టీసీ డిపో సిబ్బంది శుక్రవారం అభినందించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా విజయనగరం జోన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, మేనేజర్ మూర్తి, రామారావు, జి.నాగభూషణం, బి.ధనుంజయ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - పొందూరు


భవన నిర్మాణాల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని నాణ్యతా ప్రమాణాల విభాగం ఇఇ ఎం.వి.శేఖర్ అన్నారు. శుక్రవారం రాపాక, పొందూరులో చేపడుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. భవన నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లింపులో ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. రాపాక-1, 2 సచివాలయ భవనాలతో పాటు ఆర్‌బికె భవనాలను పొందూరు-1 సచివాలయం భవనాన్ని పరిశీలించి కొలతలు వేశారు. పరీక్షల కోసం శాంపిల్స్‌ను సేకరించారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో నాణ్యతా ప్రమాణాల విభాగం డీఈ శామ్యూల్‌రాజ్, జేఈ ఎం.అప్పలనాయుడు, పంచాయతీరాజ్ డీఈ సూర్యప్రకాశరావు, ఏఈ సత్యనారాయణ, పాల్గొన్నారు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇద్దరు టిడిపి కార్యకర్తలపై క్రమశిక్షణ చర్యలు

టెక్కలి: పట్టణానికి చెందిన టిడిపి కార్యకర్తలు రెయ్యి ప్రదీప్ చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డిలపై క్రమశిక్షణ వేటు పడింది. ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఇద్దరు కార్యకర్తలతో నిమ్మాడలో మాట్లాడి, పార్టీ కార్యక్రమాల నుంచి తప్పుకోవాలని సూచించారు. పార్టీలో అంతర్గత వివాదాల నేపథ్యంలో ఒక గ్రూపుకు మద్దతు ఇవ్వడంలో భాగంగా వారిపై వేటు పడినట్లు తెలిసింది.

విశ్వనాథ్ మృతికి నివాళి

టెక్కలి: కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతికి టెక్కలి సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ నివాళులర్పించి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విశ్వనాథ్ మృతి సినీరంగానికి తీరనిలోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో మేనేజర్ బాలకృష్ణ, రామకృష్ణ, జాని, తదితరులు ఉన్నారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన

సోంపేట: పలాసపురం పంచాయతీ లక్ష్మపురం గ్రామంలో ఎస్‌సిల శ్మశాన వాటికకు అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. స్థానిక సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు గ్రామ సమీపంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎస్‌సి కమ్యూనిటీ కోసం అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. స్థల పరిశీలన అనంతరం శ్మశాన వాటికలో షెడ్ నిర్మాణం, ఇతర పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి పి.రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జగన్నాథవలసలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

జి సిగడాం: మండలంలోని జగన్నాథవలసలో టిడిపి మండల అధ్యక్షులు కె.రవికుమార్ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బంగారునాయుడు, పార్టీ నాయకులు కంచు శ్రీరాములు, సూర్యనారాయణ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ లావణ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నౌపడ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీసు సిబ్బంది

నౌపడ ఎస్ఐగా బి.లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సారవకోట పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. నౌపడలో పనిచేసిన ఎస్ఐ మహమ్మద్ అలీ కోటబొమ్మాళి పిఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ లావణ్యకు నౌపడ పోలీసు సిబ్బంది పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు.

పరిశుభ్రత, పరిరక్షణపై అవగాహన

టెక్కలి రూరల్: పరిశుభ్రత, పరిరక్షణపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని కె.కొత్తూరు పిహెచ్‌సి డాక్టర్ నీతు అన్నారు. శుక్రవారం భీంపురం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. లింగ వివక్షత, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, ఆశ్రమ రక్షణా, భ్రూణ హత్యలు, బాలల హక్కులు, 100, 1098, 102 టోల్ ఫ్రీ నంబర్లు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: పరిసరాలను పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని హెచ్‌ఇ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగునీటి నిల్వలతో దోమలు వృద్ధి చెంది, వ్యాధులు విజృంభించే ప్రమాదముందని అన్నారు. అందుకోసం ప్రభుత్వం ప్రజలకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశావర్కర్లు, లక్ష్మి భవాని, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రైసైకిళ్లు

ప్రజాశక్తి - కంచిలి

మండలంలోని పలువురు వికలాంగులకు ట్రై సైకిళ్లను శుక్రవారం అధికారులు పంపిణీ చేశారు. కంచిలి భవిత కార్యాలయం వద్ద జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవరాజ్‌రెడ్డి, ఎంఇఒ శివరాం ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ మండలానికి 23 ఉపకరణాలు వచ్చాయని, వీటిని అర్హులైన వికలాంగులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భవిత కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మంత్రి అప్పలరాజు

జంట పట్టణాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - పలాస

పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నానని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మున్సిపాలిటీలోని 12వ వార్డులో కౌన్సిలర్ పోతనపల్లి ఉమా కుమారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పార్టీ నాయకులతో పుర వీధుల్లో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేసి పట్టణ ప్రజలకు కానుకగా ఇస్తామని చెప్పారు. గడపగడపకు వైసిపి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డు అభివృద్ధి కోసం రూ. 10లక్షలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమాకుమారి, పోతనపల్లి హరిప్రసాద్, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు , ఎఎంసి చైర్మన్ పివి సతీష్‌కుమార్, వైస్ చైర్మన్‌లు మీసాల సురేష్‌బాబు, బి. కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్, తహశీల్దార్ మధుసూదనరావు, డబ్బీరు భవానీ శంకర్, విప్ శంకర్ పండా, మహిళా అధ్యక్షులు బోర చంద్రకళ, యాళ్ల సంతోష్ , మున్సిపల్ కౌన్సిలర్స్, కో-ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలనకు నీరాజనం

కోటబొమ్మాళి: ప్రజారంజక పాలనకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లఖందిడ్డి పంచాయతీ మూలపేటలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బి.మురళి, డి.రామకృష్ణ, బి.గణపతి, కె.రామరాజు, కె.సంజీవరావు, జి.నాగభూషణరావు, బి.శ్రీరాములు, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోహనరావు

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

ప్రజాశక్తి - పలాస

రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కాశీబుగ్గలోని సిఐటియు కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకుండా అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు వింటూ ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. జరిగిన నష్టం భర్తీ కావాలంటే ప్రత్యేక హోదా సాధనకు మరోపోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన చేపట్టిన ఈ బస్సుయాత్ర శనివారం జిల్లాకు చేరుకుంటుందన్నారు. ఉదయం 10గంటలకు శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో, మధ్యాహ్నం 1.30 కాశీబుగ్గ పాత బస్టాండ్ వద్ద సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతున్నారని చెప్పారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు ఎన్.గణపతి, వి.మాధవరావు, సిహెచ్ వేణుగోపాల్, బి.రవి, తదితరులు పాల్గొన్నారు.

104 సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పొందూరు

గ్రామాల్లో 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీతులసి అన్నారు. ధర్మపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 104 ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్టు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. గ్రామంలో మంచం పట్టిన రోగులకు, గర్భిణులకు, బాలింతలకు ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో వైద్యులు శివశంకర్, సంసాద్ రెడ్డి, ఏఎన్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ రమణ, 104 డీఎం లక్ష్మణరావు, డీఈవో శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు రాజేశ్వరి. రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వం గ్రామీణ రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నదని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలోని తోగరాం పంచాయతీ ఇసకలపేట గ్రామానికి కొత్తవలస ఆర్అండ్‌బి రహదారి నుండి 1.14 కిలోమీటర్ల మేర రూ.90 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో తమ్మినేని చిరంజీవినాగ్, సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, మెట్ట ఆనంద్, బొడ్డేపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

టెక్కలి: విద్యార్థులు చదువుతోపాటు, పరిసరాలపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతో అనారోగ్య సమస్యలు రావన్నారు. కె.కొత్తూరు పిహెచ్‌సి వైద్యాధికారి గాయత్రి మాట్లాడుతూ రక్త హీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో కళాశాల ఆధ్యాపకులు, పిఒలు లూక్‌పాల్, రామారావు, సతీష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

పలాస: జాతీయ, రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాకారులను మంత్రి డాక్టర్ అప్పలరాజు శుక్రవారం అభినందించారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో బాలుర టీం ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం సాధించి, రాష్ట్ర జట్టుతో పాటు డబుల్స్‌లో తతీయ స్థానం సాధించిన జట్టులో బి.సిద్ధార్థ సభ్యునిగా ఉన్నాడు. ఎన్‌టిఆర్ జిల్లా జి.కొండూరులో జరిగిన రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలో అండర్-14లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.సిద్ధార్థ రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని సాధించాడని రాష్ట్ర టెన్నికాయిట్ సంఘ కోశాధికారి పి..తవిటయ్య చెప్పారు. విద్యార్థులు సిద్దార్థ, టి.వెంకటేష్, అండర్- 17లో తృతీయ స్థానం సాధించిన జట్టులో కె.ప్రవీణ్ కుమార్, ఎల్.రాజు సభ్యులుగా ఉన్నారని తెలిపారు.

సచివాలయాల తనిఖీ


మాట్లాడుతున్న పిఒ నవ్య

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్ 1, 2, 3 సచివాలయాలను సీతంపేట ఐటిడిఎ పిఒ బి.నవ్య శుక్రవారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఆమె రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది యూనిఫాం ధరించాలని అన్నారు. పని వేళలు పాటించాలని, ఆర్థికపరమైన ఖర్చులకు సబంధించి ప్రత్యేక రికార్డు నిర్వహించాలని అన్నారు. అనంతరం పారాపురం సచివాలయం సబ్ సెంటర్‌ను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

చిట్టేవలస పంచాయతీ సమస్యలు పరిష్కరిస్తా


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

కోటబొమ్మాళి: మండలంలోని చిట్టేవలస పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పంచాయతీ ప్రజల ఫిర్యాదు మేరకు తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్‌తో కలిసి సబ్ కలెక్టర్ ప్రజలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించలేదని, గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీలు లేవని, ఇళ్లులేని కుటుంబాలు ఉన్నాయని ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన సబ్ కలెక్టర్ అధికారులతో మాట్లాడి మీ సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సంపతిరావు రమణమూర్తి, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.మధు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గుప్పెడు బియ్యం

ప్రారంభించిన మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


బియ్యం అందజేస్తున్న విజయలక్ష్మి

నగరంలోని మెప్మా పరిధిలో గల 22,630 స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రతినెలా గుప్పెడు బియ్యం పోగు చేసి నగరంలో ఉన్న పేదలకు, అనాథ శరణాలయాలకు, నిరాశ్రయ గృహాలకు ఇవ్వాలన్న లక్ష్యంతో గుప్పెడు బియ్యం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. అలా పోగు చేసిన బియ్యాన్ని ఆమె చేతుల మీదుగా రెడ్‌క్రాస్ అనురాగ నిలయానికి, నైట్ షెల్టర్ సిబ్బంది కి అందజేశారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, నగరపాలక సంస్థ సహాయక కమిషనర్ ఆకాష్ వాణి, అకౌంట్స్ ఆఫీసర్ రాము, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు సుగుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల బాధ్యత గృహ సారథులదే


మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - బూర్జ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేసే బాధ్యత గృహ సారథులదేనని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం కొల్లివలస ఆదర్శ పాఠశాల ఆవరణలో కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీరు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకొని, వాటికి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాలంటీర్లను సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాండాపు గోవిందరావు, ఎంపిపి కర్ణేన దీప, జెడ్‌పిటిసి బి.రామారావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు ఎస్.ఉదయ్‌కుమార్, గుమ్మడి రాంబాబు, బి.నారాయణమూర్తి, నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, బి.సూర్యారావు, కె.కృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గృహ సారథులు, కన్వీనర్లు పని చేయాలని ఎమ్మెల్యే జి.కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పైడిభీమవరంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎల్.వెంకటరత్నం ప్రసాద్, జెడ్‌పిటిసి టి.సీతారాం, పెద్ద రామునాయుడు, ఆర్.బుజ్జి, ఎం.కామరాజు, అప్పలనర్సు నాయుడు, బాబా, తిరుపతిరావు, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో వైసిపి విజయం తథ్యం


మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి గెలుపు తథ్యమని వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ మున్సిపల్ కళ్యాణ మండపంలో మండల గృహ సారథులు, కన్వీనర్, వాలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 175/175 స్థానాలు గెలుపు ఇచ్ఛాపురం నుంచే అందిస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సంసిద్ధంగా ఉండాలని అన్నారు. మండల కన్వీనర్ ఆసి పురుషోత్తమరెడ్డి అధ్యక్షత జరిగిన సమావేశంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబురావు, డిసిఎంఎస్ చైర్మన్ సెల్లా సుగుణ దేవరాజు, వైసిపి నేతలు కె.మోహన్‌రావు, నూకయ్యరెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, ఉప్పాడ రాజారెడ్డి, చిట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి -నౌపడ

సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కోత అప్పోజీ సన్యాసమ్మ మెరిట్ అవార్డులు ముగ్గురు విద్యార్థులకు, లమ్మత నారాయణమ్మ చిన్నయ్య మెరిట్ అవార్డులు ముగ్గురు బాలికలకు వచ్చాయి. వారికి జ్ఞాపికలు, నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలోఆర్గనైజేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు కోత మధుసూదనరావు, కోత ధర్మారావు, ఉపాధ్యాయులు వీరభద్రరావు, తూట భాస్కరరావు, కోత.సతీష్, వైస్ ఎంపిపి ప్రతినిధి పొందల రామకృష్ణ, సర్పంచ్ ప్రతినిధి మార్పు నాగభూషణం, కోటపాడు సర్పంచ్ కోత ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.


జ్ఞాపికలు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

స్పందన వినతులను పరిష్కరించాలి


సిబ్బందితో సమీక్షిస్తున్న రవికుమార్

జలుమూరు: స్పందన వినతిలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపిడిఒ జివి.రవికుమార్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రాణ, టెక్కలిపాడు గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించి, సచివాలయ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేసుపురం ఎంపిటిసిపై ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం: కేసుపురం ఎంపిటిసి మాసుపత్రి చక్రవర్తిరెడ్డి అదే పంచాయతీకి చెందిన యువకునిపై దాడి చేశారు. యువకునికి మద్దతుగా ఉన్న జనసేన నాయకులపై దుర్భాషలాడుతూ, దాడి చేస్తానని సోషల్ మీడియాలో బెదిరింపులకు పాల్పడ్డారు. జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, తిప్పన దుర్యోధనరెడ్డి, తిప్పన నీలవేణి ఇచ్ఛాపురం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాగుల హరి బెహరా, డి.ఈశ్వరరావు, సుశీల, భాస్కరరావు, దివాకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సామర్థ్యం పెంచాలి

వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాయిరాజ్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం


తహశీల్దార్‌తో మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్

మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు సామర్థ్యం పెంచాలని రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులను మాజీ ఎమ్మెల్యే, వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎఒ శ్రీదేవి, తహశీల్దార్ గురుప్రసాద్, ఇతర అధికారులతో ధాన్యం కొనుగోలు తీరుపై చర్చించారు. మండలంలోని బాలకృష్ణాపురం, బొడ్డకాళి, కీర్తిపురం, ధర్మపురం, బెల్లుపడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు సామర్థ్యం పెంచామని అధికారులకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఈ విషయమై విన్నవించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కె.మోహన్‌రావు, సల్ల దేవరాజు, ఉప్పాడ రాజారెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, ఎ.పురుషోత్తంరెడ్డి, సాలిన ఢిల్లీరావు, రాంపత్ని చిట్టిబాబు, బాకి లక్ష్మీనారాయణ, బతకల మోహన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస


ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థులు, అధ్యాపకులు

విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని పాఠశాల హెచ్ఎం బోర కుమారస్వామి అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ హైస్కూల్ గేటు పాఠశాలలో విద్యార్థుల్లో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కోసం ఎస్‌సిఆర్‌టి, సమగ్ర శిక్ష సంయుక్తంగా ఎంటర్ ప్రన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్మెంట్ కార్యక్రమం నిర్వహించాయి. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్టు వివరాలను ఇఎండిపి జిల్లా మేనేజర్ ఎ.అనూష అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కె.వెంకటసాయి, బి.మృదుల, ఎస్.ఢిల్లేశ్వరి, బి.భరత్, ఎన్.రోహిత్, ఎస్.వైభవ్, కె.గౌతమ్ సాయి మాట్లాడుతూ వర్షపు నీటి నిల్వ ద్వారా తాగునీరు, మురుగునీటిని స్వేదనం పద్ధతి ద్వారా తాగునీరుగా మార్చడానికి ఖనిజాలు జోడించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం అని అన్నారు. హెచ్ఎం కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థులు తదుపరి ఎక్స్‌పోకు సంసిద్ధమవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా అనూష విద్యార్థులు, ఉపాధ్యాయురాలు రాణిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీకాలతో జీవాలకు రక్షణ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

టీకాలతో మూగజీవాలకు రక్షణ కలుగుతుందని జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పూండి గోవిందపురంలో మూగజీవాలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టీకాలను పాడి రైతుల ఇళ్ల వద్దకు వచ్చి పశు వైద్యాధికారులు వేస్తారని, దీన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచిత ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిస్తుందని, ప్రతి రైతూ తప్పకుండా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. గోవిందపురం పశు వైద్యాధికారి రాజ్‌కిరణ్ మాట్లాడుతూ మండలంలో 18531 మూగజీవాల ఉండగా ఇప్పటికే 90శాతం టీకాలు వేసే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు డోక్కరి మోహన్‌రావు, పాలిన శోభన్, పశువైద్య సిబ్బంది ఎన్.భగవతి తులసిరావు, రైతులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : టీకా వేస్తున్న పశు వైద్యుడు

మెళియాపుట్టి: మండలంలో 12 వేల జీవాల్లో 10వేలకు పిపిఆర్ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి పి.అనిల్ తెలిఆరు. ఈ టీకాల కార్యక్రమం 28వ తేదీ వరకు కొనసాగుతుందని, నాలుగు పశువైద్య బృందాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం లింగుపురం గ్రామంలో పిపిఆర్ టీకాల కార్యక్రమాన్ని శ్రీరామకృష్ణ గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం అధ్యక్షుడు దుక్క బాలరాజుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టి.శేషగిరిరావు, డైరెక్టర్లు బి.కృష్ణమూర్తి, టి.కృష్ణారావు, కె.పాపారావు, సిమ్మయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని పాలవలస ఆర్‌బికె పరిధిలో జీవాలకు పిపిఆర్ టీకాలను పశువైద్యాధికారి జ్యోత్స్న వేశారు. ప్రతి జీవానికి ఇన్సురెన్స్ ట్యాగ్‌ను వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అల్లెన పశు వైద్యశాల జెవిఒ కె.సూర్యనారాయణ, ఉంగటి సూర్యనారాయణ, జల్లు బలరాంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసహాయం అందజేస్తున్న గౌతు శిరీష

గౌతు శిరీష పరామర్శ

ప్రజాశక్తి -పలాస

మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు రాజపురం గ్రామానికి చెందిన తాళభద్ర అప్పలస్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష శుక్రవారం ఆయనను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఆమెతో పాటు రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, పట్టణ అధ్యక్షులు నాగరాజు, గాలి కృష్ణ, నవీన్, గురిటి సూర్యనారాయణ, జోగ మల్లేశ్వరరావు, గోళ్ల చంద్రరావు పాల్గొన్నారు.

మెనూ అమలు తప్పనిసరి

కోటబొమ్మాళి: జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం రుచికరంగా వండి పెట్టాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నబమ్మిడి ఎంపియుపి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించి, విద్యార్థులకు భోజనం మెను ప్రకారం రుచికరంగా వండి పెడుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు.

నేడు పేరెంట్స్ వర్షిప్ డే వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పరిమితం చేస్తున్న తరుణంలో చిన్నారుల్లో అటువంటి భావనలను రానీయకుండా ఉండేందుకు నగరంలోని యోగ వేదాంత సేవా సమితి పేరెంట్స్ వర్షిప్ వేడుకలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా నగరంలోని సూర్యమహల్ జంక్షన్ నుంచి ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానం వరకు తల్లిదండ్రులతో పాటు చిన్నారులు ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ అనంతరం ఏడు రోడ్ల జంక్షన్ వద్దగల ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు, తల్లిదండ్రులకు వందనం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుకేశిని అరవల తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు హైదరాబాద్‌కు చెందిన పలువురు హాజరు కానున్నట్లు తెలిపారు.

శ్రమ యోగి మాన్‌ధన్‌లో చేరండి

టెక్కలి రూరల్ : అసంఘటితరంగ కార్మికుల సామాజిక భద్రత కోసం ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధాన్ పథకంలో ప్రతి ఒక్కరూ చేరాలని కార్మికశాఖ అధికారి అర్.రాధాకుమారి అన్నారు. శుక్రవారం టెక్కలిలో కిరాణి షాపులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కార్మికులు ఈ పథకంలో చేరాలని సూచించారు. ఈ పథకంలో చేరాల్సిన వారు 16ఏళ్ల నుండి 50 ఏళ్ల వయసుగల ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరవచ్చని, ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మీ దగ్గరగల మీసేవ సెంటర్‌లో ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, బ్యాంకు ఖాతా నంబరుతో నమోదు చేసుకోవచ్చన్నారు.

ధ్రువపత్రాల జారీలో అప్రమత్తం

ప్రజాశక్తి - కవిటి

కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేటప్పుడు, ముఖ్యమైన విధులు నిర్వర్తించే సమయంలో సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపిడిఒ పైల సూర్యనారాయణరెడ్డి సూచించారు. మండలంలోని కపాసుకుద్ది సచివాలయాన్ని శుక్రవారం ఎంపిడిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ సచివాలయానికి వచ్చే వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. ఆయనతో పాటు ఈఓ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్ పాల్గొన్నారు.

ఉగాదికి పూర్తి చేయాల్సిందే

ప్రజాశక్తి - కవిటి

మండలంలో ఇంకా నిర్మాణ దశలో ఉన్న జగనన్న ఇళ్లు ఉగాది నాటికి పూర్తి చేయాల్సిందేనని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. హౌసింగ్ డిఇ శేషయ్య అధ్యక్షతన మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కడియాల ప్రకాష్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉగాదికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని, ఇప్పటికే వివిధ దశలు దాటిన ఇళ్ల నిర్మాణాలకు పెండింగ్ లేకుండా బిల్లులు మంజూరు చేయాలని సూచించారు. హౌసింగ్ ఎఇ సాయికిరణ్ మాట్లాడుతూ మండలంలో 367 ఇల్లు ఇప్పటికే గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని, మిగతా 469 ఇళ్లు ఉగాది నాటికి సిద్ధం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ పైల సూర్యనారాయణ రెడ్డి, ఇఒఆర్డి శివాజీ పానిగ్రాహి, ఎఒ జయంత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాష్

మహిళా సంఘాలతో చైర్‌పర్సన్ భేటీ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పురపాలక సంఘం కార్యాలయంలో ఐదు స్వయం సహాయక సంఘాలతో భేటీ అయ్యారు.. 7వ వార్డు నుంచి వెంకటేశ్వర సంఘం, 21వ వార్డుకు చెందిన రాఘవేంద్ర, 23వ వార్డు నుంచి దీప సంఘం, 20వ వార్డు నుంచి పాతాళేశ్వర సంఘం, భవాని సంఘం సభ్యులతో మెప్మా ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క కుటుంబానికీ మూడు నుండి, నాలుగు అంతకన్నా ఎక్కువ పథకాలు అందుతున్నాయని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా ప్రభుత్వ యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. ఎవరికైనా అర్హత కలిగియుండి. లబ్ధి పొందని వారు సమస్యను తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసిన నాయకులు, కార్యకర్తలతో అచ్చెన్న మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని చెప్పారు. అధికార పార్టీ బెదిరింపులకు భయపడొద్దన్నారు. అంతకు ముందు చిన్నబమ్మిడి పంచాయతీ సుబ్బారావుపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి నేతింటి అప్పలస్వామి తల్లి నారాయణమ్మ మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని అచ్చెన్న పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.



అచ్చెన్నాయుడును కలిసిన టిడిపి నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు చిన్నబమ్మిడి విద్యార్థులు

కోటబొమ్మాళి: ఏలూరు జిల్లా పెద్దవేగిలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు చిన్న బమ్మిడి ఎంపియుపి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆల లిఖిత, ముద్దాడ షర్మిల ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం కె.భానుమూర్తి శుక్రవారం తెలిపారు. వీరి ఎంపికపై పాఠశాల సిబ్బంది, పిఇటి, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందిస్తూ గెలుపుతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి.హెచ్ కేశవరావు, ఐ.వరహాలు, పి.షణ్ముఖరావు, పిఇటి అనంత్, రామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వర్ వెళ్లి పింఛను అందజేత

ఆమదాలవలస : మున్సిపాలిటీలోని నాలుగో వార్డు కనిందవలసకు చెందిన వాలంటీర్ గుజ్జల నరసమ్మ శుక్రవారం ఒడిశాలోని భువనేశ్వర్ వెళ్లి వృద్ధురాలికి పింఛను అందించారు. గ్రామానికి చెందిన గొర్లె చిన్నమ్మడు కుటుంబ కారణాలవల్ల భువనేశ్వర్‌లో తన కుమార్తె రాములమ్మ ఇంటికి వెళ్లింది. ఆమె ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంది. ఈ నెల పింఛను తీసుకోకుంటే డబ్బులు వెనక్కి వెళ్లిపోతాయి కనుక వాలంటీరు ఆమె వద్దకు వెళ్లి పింఛను అందించారు. ఈ సందర్భంగా వాలంటీరును ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాలకృష్ణ

కొత్తూరు: మండల ఉప తహశీల్దార్ కె.బాలకృష్ణను ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నియమిస్తూ సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహశీల్దార్‌గా పని చేసిన పి.బాలను శ్రీకాకుళం కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

హెల్మెట్ ధారణపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

హెల్మెట్ ధరించడం వల్ల ప్రయాణ ప్రమాద సమయాల్లో ప్రాణాలు కాపాడుకోవచ్చని ట్రాఫిక్ ఎస్ఐలు లక్ష్మణరావు, వెంకటరావు అన్నారు. నగరంలోని ఎస్పి కార్యాలయం వద్ద వినూత్న తరహాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి హెల్మెట్ ధారణపై శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని, అందులో భాగంగా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. వాహనదారులను అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిబ్బందికి వాహనదారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: హెల్మెట్ లేని డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, వాహనదారులు హెల్మెట్ ధరించాలని సిఐ ఈశ్వర్ చంద్రప్రసాద్, టౌన్ ఎస్ఐ.గోవిందరావు అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకం వల్ల కలిగే ఉపయోగాలు, లేకపోతే జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఆయనతో పాటు పట్టణ పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఇచ్ఛాపురం: హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జనసేన జెండా ఆవిష్కరణ

కవిటి: మండలంలోని గొర్లపాడు గ్రామంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం జనసేన జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10వ తేదీ నుంచి జరగనున్న జనసేన క్రియాశీల సభ్యత్వం కార్యక్రమంలో జన సైనికులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, నాగుల హరి బెహరా, డొక్కరి ఈశ్వరరావు, క్రాంతికుమార్, దివాకర్, దాలయ్య, భాస్కర్, తలగాన సునీల, కుర్మారావు, అంగ సురేష్, దుంగు భాస్కర్, ప్రదీప్ తదతరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

టెక్కలి రూరల్: టెక్కలి నియోజకవర్గంలో ప్రతి రైతు నుంచీ ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం టెక్కలి వైసిపి కార్యాలయ ఆవరణలో నియోజవర్గ స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు రైతుకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఈ విషయాన్ని అధికారులు గమనించాలన్నారు.

టెక్కలి: బొప్పాయిపురం ఆర్‌బికె ద్వారా నిర్దేశిత లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు చేపట్టాలని సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆర్‌బికె సిబ్బందితో సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు నిర్దేశిత లక్ష్యం మేరకు కొనుగోళ్లు జరిగాయా? లేదా అన్నదానిపై వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా పెండింగ్‌లో ఏమైనా ఉంటే త్వరితగతిన చేపట్టాలని కోరారు. రైతులకు కొనుగోళ్ల విషయంలో ఎటువంటి లోపాలు రాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఎఒ సుమంత్, రైతులు ఆరంగి రాజు, దాసరి రామారావు, బాలయ్య, కోనారి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ జోగారావు

ఆర్‌బికెలతో రైతులకు మేలు

సోంపేట: రైతు భరోసా కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. స్థానిక సచివాలయం వద్ద వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక విధానాన్ని ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతులు ధాన్యం విక్రయించేటప్పుడు అయిన రవాణా ఖర్చులు సైతం రైతుల అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

స్వయంశక్తి సంఘాలు బలోపేతం

పొందూరు: ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయంశక్తి మహిళా సంఘాలు బలోపేతం కావాలని ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు అన్నారు. దల్లవలస, పొందూరులో శుక్రవారం స్వయంశక్తి సంఘాల ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 39 గ్రామైక్య సంఘాలులోని 1,739 స్వయం శక్తి మహిళా సంఘాలు సభ్యులు తమ ఆర్థిక లావాదేవీలను ఆడిట్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి సంఘం సభ్యులు రూ.450లు చెల్లించి ఆడిట్ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిసి సూర్యప్రభ, సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఎం శ్యామలరావు